# లక్ష్మీ డాటిక్



నర్సింగ్ హోంలో ఫోన్ మోగింది.

"యస్. డాక్టర్ రమాకాంత్ స్పీకింగ్"

"నమస్కారం డాక్టర్, నేను శ్యామలరావు గారి భార్యని. మాలతిని" "చెప్పండి, ఏమిటి విషయం?"

"మీరొక్కసారి మా ఇంటికి రావాలి"

"ఇప్పుడా?"

"కాదు. మా వారు లేనప్పుడు రావాలి. అప్పుడైతే మనసు విప్పి..."

"మనస్సు విప్పి చెపుతారా- అంత సీక్రెట్ జబ్బా? సరే.. ఎప్పుడు రమ్మంటారు?"

"రేపు. వారు టూర్ వెళ్తున్నారు. వారం దాకా రారు. వారు వెళ్ళగానే మీకు ఫోన్ చేస్తాను"

"నాకు రాత్రి 9 తర్వాత గానీ వీలుపడదు"

"అప్పుడే రావాలి. పగలు నౌకరులు వాళ్ళు వుంటారు. అప్పుడయితే బాబు కూడా నిద్రపోతాడు"

"ఒ.కె. రేపు రాత్రి వస్తాను" ఫోన్ పెట్టేశాడు డాక్టర్ రమాకాంత్.

మర్నాడు భర్త వూరికి పోగానే మాలతి ఫోన్ చేసింది.

డాక్టరు బయల్దేరాడు. ఎన్నో వూహలు ఆయన్ను మెలికలు తిప్పుతున్నా, కారు మెలికలు తిరిగి యాక్సిడెంటు కాకుండా మాలతి వాకిట్లో ఆగింది. తెల్ల చీరె, మల్లె పూలతో వాకిట్లో నిలబడి స్వాగతం చెప్పింది మాలతి. మేడ మీదికి తీసికెళ్లిందది. హాల్లో సోఫాలో కూచున్నాడు. తలుపులు లోపల గడియ పెట్టింది. సినిమాలో రేపు సీను వూహిస్తున్నాడు డాక్టరు రమాకాంత్.

"ఛా, ఛా పెద్ద బిజినెస్ మాగ్నెట్ భార్య మాలతి. పైగా శ్యామలరావు చాలా అందమైనవాడు. ఇంత చదువు చదివి ఫూల్ లాగా ఆలోచిస్తున్నానేమిటి?" అనుకున్నాడు డాక్టరు. కానీ, విషయమేమిటి అని అడిగితే తన మగసిరి థర్మామీటరు 'జీరో'కి పడిపోతుందని వూరుకున్నాడు. తన కోటు గుండీలు మాత్రం తీశాడు.

"ఉక్క పోస్తోందా! ఎ.సి. రూంలోకి పోదాం." అంది.

"అక్కర్లేదు, చెప్పండి" అన్నాడు.

"ఏం లేదు డాక్టరుగారూ! బాబుకు అయిదేళ్ళు వచ్చాయి. మా వారు నేను కాపరానికొచ్చిన కొత్తల్లో ఒక ఫ్లాస్కు నిండా ద్రాక్ష, ఒక దానినిండా బాదం ఖీరు, ఒక ఫ్లాస్కు నిండా 'టీ' బెడ్ రూం నిండా పెట్టుకుని, ఆత్రేయలా ఏదో సృష్టిస్తానని తాను నిద్రపోరు, నన్ను నిద్రపోనిచ్చేవారు కాదు. ఫలితం బాబు పుట్టాడు. ఈ మధ్య రెండు మూడేళ్ల నించి నడక మారింది. మూడో ఫ్యాక్టరీ కట్టి కోటీశ్వరుడనిపించుకున్నారు.

ఇప్పుడు రాత్రి వేళ కన్ను మూయరు, నన్ను మాత్రం మేలుకోనీరు. గంట గంటకీ కిందకి దిగి పెరట్లో గెస్ట్ హౌస్ పక్కన అవుట్ హౌసుకు వెళ్ళొస్తారు. అలికిడికి నాకు మెలుకువ వస్తే పడుకునేదాకా చివాట్లు పెడ్తారు" అంది మాలతి.

"అవుట్ హౌస్‌లో వయసొచ్చిన సర్వెంట్ మెయిడ్ వుందా? లేక వుండేదా?" ప్రశ్నించాడు డాక్టర్.

"వుండేది. చాలా అందమైంది. అది ఇంట్లో పని చేస్తుంటే నాకే దాన్ని ముద్దెట్టుకోవాలని పించేది. ఏ వేళప్పుడు మా వారి గుండెల్లో గుడి కట్టుకుంటుందో అని పది వేలు ఖర్చు పెట్టి దాని పెళ్ళి చేసి 'పేదల పెన్నిధి' అని బిరుదు పొందాను"

"మీరు ఒకరాత్రి డిటెక్టివ్ లాగా ఏ పొదల చాటునో పొంచి చూడాల్సింది" అన్నాడు డాక్టర్.

"చూశాను. కాని ఒక్క పురుగు కనిపించలేదు. రాలిన పూలు లేవు. అక్కడున్న బెడ్ నలగలేదు, సెంటు వాసన రాలేదు. అగరు వత్తుల వాసన వుంది. ఒకటి వెలుగుతోంది" అంది మాలతి.

"అయితే తేలిపోయింది. అక్కడ ఖచ్చితంగా మరో స్త్రీ వుంది. శ్యామలరావు ఆమె వలలో చిక్కాడు. ఆమె పేరు లక్ష్మి."

"మీకు తెలుసా మా వారి కథ?"

"యస్. ఆమె మనిషి రూపంలో వుండదు. నల్లగా వుంటుంది. దాని పేరే బ్లాక్ మనీ.

ఆయన గుప్తంగా దాచి వుంటాడు. పిచ్చి మాలతి దేవి! గో అండ్ స్లీప్ హేపిలీ... హేవ్ స్వీట్ డ్రీమ్స్" అని డాక్టర్ చెప్పి వెళ్ళాడు. మాలతి ఆశ్చర్యంలో మునిగింది. హాయిగా గుండె మీద దిండుతో నిద్ర పోయింది.

-చెరువు ఆంజనేయశాస్త్రి

## దృక్కోణాలు

**జీవితం:** రెండు నిద్రల మధ్య నడిచే అలజడి,
ఏదో ఒక దాన్ని పొందాలని పడే ఆరాటం

**వెలుగు:** ప్రభాత ప్రదోషాల మధ్యజ్వలించే మెరుపు,
రెండు రాత్రిళ్ళ మధ్య, కదిలే చేతనావస్థ

**ఆనందం:** దుఃఖం అంతరించాక పొందే అనుభవం,
దుఃఖానికి ముందున్న స్థితి

**శాంతి:** సంఘర్షణ అంతరించాక పొందే మనోస్థితి,
సంఘర్షణకి ముందున్న స్తబ్ధతావస్థ

**ప్రేమ:** రెండు హృదయాల మధ్య స్పందన,
రెండు కామతప్త శరీరాల తాకిడిలో
ఉద్భవించే చలనం

**ధర్మం:** మనిషి స్వార్థంపైన మానవత్వపు విప్లవం,
వ్యక్తి స్వాతంత్ర్యం పైన సమాజ నియంత్రణ.

**అహింస:** హింసతో పోరాడే ఆయుధం,
మనిషి- జంతు ప్రవృత్తికి అసహజం

—డా. జి.ఆర్. క్రిష్ణ